వంటిమామిడి, కొండపాక ఏఎంసీలకు పాలకవర్గాల ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని వంటి మామిడి, కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.



సంగారెడ్డిలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి


ర్యాలీలో మాట్లాడుతున్న నిర్మలా జగ్గారెడ్డి

రన్ ఫర్ జీసస్ ర్యాలీలో నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్, ఐటీఐ, కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు నిర్వహించిన మహార్యాలీలో డ్యాన్సులు చేస్తూ, నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ జీసస్ చూపిన మార్గంలో నడవాలన్నారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్నివర్గాల పేదలకు లబ్ధి చేకూరుతున్నదని పేర్కొన్నారు.


చింతమడక గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన హరీశ్‌రావు

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనాలి

9

- అకాల వర్షాలకు ఆగమవుతున్నరైతులు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నారాయణరావుపేట రైతువేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి, నూతన ఆర్వోఆర్ చట్టంను రూపకల్పన చేసిందని కలెక్టర్ ఎం.మనుచౌదరి రైతులకు సూచించారు. శనివారం నారాయణరావుపేట, చిన్నకోడూరులోని రైతువేదికలో భూ భారతి చట్టంపై అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి అవగాహన కల్పించారు. చట్టంలోని వివిధ అంశాలను రైతులకు, ప్రజలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ సమస్యను ఎవరు ఎన్ని రోజుల్లో పరిష్కరించాలి, కాకుంటే ఎలా అప్పీల్‌కు వెళ్లాలనే దానిపై మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. సీసీఎల్ఏకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు అధికారాలను అప్పగించామని తెలిపారు. ఆర్డీవో నిర్ణయంపై కలెక్టర్‌కు, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తారని తెలిపారు. దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పడుతుందని పేర్కొన్నారు. భూ భారతి చట్టంలో ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని, వ్యక్తిగత సమస్యలుంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, నారాయణరావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్‌లు లక్ష్మీరెడ్డి, హరికిరణ్‌కుమార్, ఏవోలు పరుశురాంరెడ్డి, జయంత్ కుమార్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నారాయణరావుపేటలో, చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ధాన్యం తూకంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూసుకోవాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు.

నాణ్యతా ప్రమాణాల బ్రోచర్ అందజేత

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ మనుచౌదరికి కలెక్టరేట్‌లో శనివారం భారత నాణ్యతా ప్రమాణాల బ్రోచర్‌ను రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు అందజేశారు. అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, ఇతర ఉన్నతాధికారులకు బ్రోచర్లను ఇచ్చారు. అందజేసిన వారిలో కరీంనగర్ రీజియన్ కార్యదర్శి బూట్ల రాజమల్లయ్య, హుస్నాబాద్ ప్రతినిధులు కొత్తపల్లి రాజేందర్, బూట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


బేగంపేట పాఠశాలలోని మ్యాథ్స్ ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ప్రయోగాలతో పాఠాలు

- జిల్లాలో సైన్స్, మాథ్స్ ల్యాబ్‌ల ఏర్పాటు
- కృత్యాధార బోధన, సులభంగా అభ్యసనం
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తున్న విద్యార్థులు

9

జిల్లాలో వింత వాతావరణం చోటుచేసుకున్నది. అటు భానుడు తన తాపాన్ని తీర్చుకుంటుండగా.. ఇటు వరుణుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయమే భానుడు భగ్గుమంటుంటే.. సాయంత్రం వేళ వాతావరణం చల్లబడి, అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వాన బీభత్సం సృష్టిస్తోంది. శనివారం జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలో అత్యధికంగా 42.5 డిగ్రీలు నమోదు కాగా, విచిత్రంగా సాయంత్రం పలుచోట్ల మబ్బులు కమ్ముకుని గాలివాన కురిసింది.


సిద్దిపేటలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

మండలం	గ్రామం	గరిష్ఠ	కనిష్ఠ
తొగుట	తుక్కాపూర్	42.5	22.1
కోహెడ	సముద్రాల	42.4	26.1
సిద్దిపేట రూరల్	రాఘవపూర్	42.2	25.8
అక్బర్‌పేట-భూంపల్లి	పోతరెడ్డిపేట	41.8	21.7
సిద్దిపేట అర్బన్	సిద్దిపేట	41.7	25.4
కోహెడ	కోహెడ	41.7	26.3
కోహెడ	శనిగరం	41.7	26.5
బెజ్జంకి	బెజ్జంకి	41.6	26.5
తొగుట	రాంపూర్	41.2	24.3
హుస్నాబాద్	హుస్నాబాద్	41.0	27.1
తొగుట	వెంకట్రావుపేట	40.5	23.6
అక్కన్నపేట	కట్కూర్	40.4	27.9
మద్దూరు	రేబర్తి	40.3	24.6
దుబ్బాక	హబ్షీపూర్	40.3	24.2
కొమురవెల్లి	కొమురవెల్లి	40.3	22.0
దౌల్తాబాద్	దౌల్తాబాద్	40.1	21.9
చిన్నకోడూర్	పెద్దకోడూర్	40.1	26.5
చేర్యాల	ముస్త్యాల	40.1	21.6

సూర్య తాపం.. వరుణుడి ప్రతాపం

- జిల్లాలో ఉదయం ఎండ, సాయంత్రం వాన
- 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు వేడి
- సాయంత్రమైందంటే పలకరిస్తున్న వాన

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 19 : ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగ్గుమంటున్నాడు. వాతావరణంలో మార్పుల కారణంగా సాయంత్రం మాత్రం చిరుజల్లులతో పాటు మోస్తరుగా వర్షం కురుస్తుండటంతో చల్లబడుతోంది.


దుకాణాల ఎదుట గ్రీన్‌మ్యాట్

వాహనాల పార్కింగ్‌కు టెంట్లు

సిద్దిపేటలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులతో పాటు చిరు వ్యాపారానికి అడ్డాగా ఉన్న సుభాష్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేలా పలువురు వ్యాపారులు చలివేంద్రాలతో పాటు దుకాణాల ముందు నీడనిచ్చేందుకు గ్రీన్‌మ్యాట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో శనివారం జరిగిన ఓ సంఘం సమావేశంలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసేందుకు టెంట్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఉదయాన్నే తమ గమ్యానికి చేరుకుంటుండగా, అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావడంలేదు.



42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొన్నిరోజులుగా 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదవుతున్నది. శనివారం తొగుట మండలంలోని తుక్కాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో గరిష్ఠంగా 42.5 డిగ్రీలు నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అకాల వర్షం కురియగా, అక్బర్‌పేట-భూంపల్లిలోని పోతారెడ్డిపేటలో 23.8 మిల్లీమీటర్లు, దౌల్తాబాద్‌లో 26.8 మి.మీ., చేర్యాలలోని ముస్త్యాలలో 17.3 మి.మీ., దుబ్బాకలోని చీకోడ్‌లో 26.5 మి.మీ., కొండపాకలో 24.0 మి.మీ., వర్గల్‌లోని గౌరారంలో 10.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.




మద్దూరులో తడిసిన ఆరబెట్టిన ధాన్యం, చేర్యాల మండలం పెద్దరాజుపేటలో రాలిన వడ్లు, అక్కన్నపేట మండలం కేశవాపూర్‌లో నేలవాలిన వరి

గాలివాన బీభత్సం

చేర్యాల/మద్దూరు/అక్కన్నపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల, మద్దూరు, అక్కన్నపేట మండలాల్లో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. చేర్యాల మండలం పెద్దరాజుపేట, నాగపురి, పోతిరెడ్డిపల్లి, కడవేరుగు, రాంసాగర్, వీరన్నపేట తదితర గ్రామాల్లో సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. దీంతో వరిపంట దెబ్బతింది. పెద్దరాజుపేటలో ధాన్యం గింజలు నేలరాలి చేలు మొత్తం వాలిపోయింది. వీరన్నపేట శివారులోని పొలంలో తాటిచెట్టు నేలకూలింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టుకూలి ప్రధానదారిపై పడిపోయింది. మద్దూరు మండలంలోని లద్నూరు, ధర్మారం, మర్మాముల, సలాఖ్‌పూర్, లక్కపల్లి, రేబర్తి, వల్లంపట్ల, నర్సాయపల్లి, గాగిళ్లాపూర్ గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, మంచినీళ్ల బండ, కేశవాపూర్, పంతులుతండా, గోవర్ధనగిరి, తురకవానికుంట, ధర్మారం గ్రామాల్లో వడగండ్ల వానతో మామిడికాయలు నేలరాలాయి. వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు మల్లంపల్లిలో మాజీ ఎంపీటీసీ మ్యాక రమేష్, కేశవాపూర్‌లో గన్నెబోయిన భగవంత్, పంతులుతండాలో బానోతు కిషన్‌నాయక్‌లకు చెందిన ఇంటి రేకుల పైకప్పులు లేచిపోయాయి. ఈ సమయంలో ఇళ్లలోనే ఉన్న కుటుంబ సభ్యులు బయటికి పరుగులు తీశారు. మల్లంపల్లిలో రాజరాజేశ్వర రైస్ మిల్లులో కూలీలు నివాసం ఉండే ఇళ్లపై రేకులు లేచిపోయాయి.



హెచ్‌హైవీ

- జిల్లాలో పెరుగుతున్న పాజిటివ్ కేసులు
- ప్రతీ నెల 50కిపైగా నమోదు
- 17 నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువ
- మొత్తంగా ఆడవాళ్లే అధికం
- వందకుపైగా చిన్నారులకు కూడా
- 1,029 మందికి పింఛన్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 19 : అవగాహన లేమి కారణమో, పరిస్థితుల ప్రభావమో తెలియదు గాని కొంతమంది హెచ్ఐవీ బారిన పడుతున్నారు. జిల్లాలోనూ ఎయిడ్స్ మహమ్మారి కోరలు చాస్తున్నది. ప్రతీ నెల పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. అందులోనూ వంద మందికిపైగా బాలబాలికలకు మహమ్మారి బారిన పడడం కలవరపెడుతున్నది.

జిల్లాలో 3,988 యాక్టివ్ కేసులు

జిల్లాలో 3,988 ఎయిడ్స్ యాక్టివ్ కేసులున్నాయి. ఇందులో పురుషులు 1852 మంది, మహిళలు 2017, ట్రాన్స్ జెండర్లు 17 మంది వరకు ఉన్నారు. తల్లిదండ్రుల ద్వారా వైరస్ బారిన పడిన బాలురు 47 మంది, బాలికలు 55 మంది ఉన్నారు. ఈ కేసులలో 17 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఉన్నారు. మొత్తంగా జిల్లాలో హెచ్ఐవీ బాధితుల్లో మహిళలే అధికంగా ఉన్నారు.

జిల్లాలో భయపెడుతున్న కేసులు

అనారోగ్య సమస్యల ఆధారంగా, ఐసీటీసీ (ఇంటిగ్రేటేడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సర్వీసెస్) సిబ్బంది, హెచ్ఐవీ వైరస్‌కు సంబంధించిన ట్రైడాట్, వెస్ట్రన్ బ్లాట్, సీడీ సెల్ కౌంట్ పరీక్షల ద్వారా పాజిటివ్‌గా తేలితే ఎయిడ్స్‌గా నిర్ధారిస్తున్నారు. ఇలా ప్రతీ నెల జిల్లాలో 50కిపైగా కేసులు

మిగతా 10వ పేజీలో

ఆంధ్రజ్యోతి విజేతలకు బహుమతులు


బైక్ విన్నర్ వేణుకృష్ణకు చెక్‌ను, కన్సోలేషన్ విజేతలకు బహుమతులను అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం బహుమతులను అందజేశారు. హైదరాబాద్ యూనిట్‌లో 200 మంది కన్సోలేషన్ బహుమతులు గెలుచుకోగా అందులో 22 మంది సిద్దిపేట జిల్లాకు చెందిన ఆంధ్రజ్యోతి పాఠకులు ఉన్నారు. అంతేకాకుండా మొదటి బహుమతి బైక్ సిద్దిపేటకు చెందిన వేణుకృష్ణ గెలుచుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు వేణుకృష్ణకు చెక్‌ను అందజేశారు. 22 మందికి కన్సోలేషన్ బహుమతులను అందజేసి, విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ ఎం.రవియాదవ్, ఆంధ్రజ్యోతి అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలోని సిద్దిపేటకు చెందిన ఫాతిమా(సంగాపూర్), ఎం.గణేష్, కె.వినోద్, మహ్మద్ మదార్, కె.శ్రీవేద, టి.సందీప్, టి.వినీత, జి.మంజుల(వెలికట్ట), పి.సత్యానారయణ (రాంనగర్), గజ్వేల్‌కు చెందిన ఎస్‌కె.సమీర్, డి.స్వప్న, జె.సంతోషిమాత, ఎండి.సనా, హుస్నాబాద్‌కు చెందిన పి.బాలయ్య, జి.సాగర్, నంగునూర్‌కు చెందిన వి.ఆధ్యారెడ్డి, దుబ్బాకకు చెందిన జి.అన్విత్, జి.వైష్ణవి కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారు.

పత్తి మిల్లులో నుంచి రూ.59 లక్షలు మాయం

● తుర్కవడగాం శివారులోని సమర్థ్ కాటన్‌మిల్లులో ఘటన ● క్యాషియర్‌పైనే అనుమానాలు ● దర్యాప్తు చేపట్టిన పోలీసులు

కంగ్టి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పత్తి మిల్లులో నుంచి రూ.59 లక్షలు మాయమైన ఘటన కంగ్టి మండల పరిధిలోని తుర్కవడగాం శివారులో గల సమర్థ్ కాటన్‌మిల్లులో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కవడగాం శివారులో గల సమర్థ్ కాటన్ మిల్లులో ఈ నెల 17న మిల్లు యజమాని వివేక్, మిల్లులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న మహదేవ్ అప్పన్న కలిసి కర్ణాటకలోని బీదర్ ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ.కోటి డ్రా చేసుకొని తెచ్చారు. వీటిలో రూ.18 లక్షలు పత్తిని విక్రయించిన రైతులకు చెల్లించారు. మిగతా వాటిలో రూ.22 లక్షలు బెడ్ కింద పెట్టి మరో రూ.59 లక్షలను లాకర్‌లో పెట్టాలని, అదే మిల్లులో పని చేసే మరో క్యాషియర్ రాంథాకరే అనే వ్యక్తి మహదేవ్‌కు సూచించాడు. అదే రోజు రాత్రి మిల్లులోనే నిద్రించిన రాంథాకరే ఉదయం లేచి చూసేసరికి సీసీ టీవీల స్విచ్‌లు ఆఫ్ చేసి ఉన్నాయి. అనుమానంతో బెడ్ కింద ఉంచిన డబ్బులు చూడగా రూ.22 లక్షలు అలాగే ఉన్నాయి. కాని లాకర్ తాళం తీసి ఉండడాన్ని గమనించిన రాంథాకరే క్యాషియర్ మహదేవ్‌ను పిలిపించి అడుగగా తాను రూ.59 లక్షలు లాకర్‌లోనే పెట్టానని డబ్బులు పోయిన విషయం తనకు తెలియదని చెప్పాడు. దీంతో ఈ విషయాన్ని రాంథాకరే మిల్లు యజమాని వివేక్‌కు తెలిపాడు. మిల్లులో క్యాషియర్‌గా పని చేసే మహదేవ్ అప్పన్నపైనే అనుమానం ఉందని మిల్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

స్లాట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

● గజ్వేల్ దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్లాట్ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గజ్వేల్ దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ హమీద్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుకింగ్ విధానానికి వ్యతిరేకంగా దస్తావేజు లేఖరులు శనివారం బంద్ నిర్వహించిన అనంతరం సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్లాట్ విధానంతో ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని, ఎన్నో ఏళ్లుగా దస్తావేజు లేఖరులుగా పనిచేస్తున్న తాము ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు కూడా రోడ్డున పడే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖరుల సంఘం ఉపాధ్యక్షులు ధనుష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మసూద్, సంయుక్త కార్యదర్శి ప్రసాద్, ముఖ్య సలహాదారులు మల్లేశం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

● చేర్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్‌లలో స్లాట్ విధానం రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ శనివారం చేర్యాల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చేపట్టారు. పాతపద్ధతిలో కొనసాగించి ప్రభుత్వ ఆదాయం పెంపొందించాలని డిమాండ్‌చేశారు.



నిందితులను చూపుతున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్

గ్రీన్ పార్క్‌హౌజ్‌లపై పోలీసుల దాడులు

● ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మనోహరాబాద్ ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఫార్మ్‌హౌజ్‌లపై దాడి చేసి పలువురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మనోహరాబాద్ మండలం కూచారం శివారులో జరిగింది. శనివారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధర్వంలో పోలీసులు స్టాప్ వింటర్ గ్రీన్ ఫార్మ్ హౌజ్‌పై దాడి చేశారు. అదే సమయంలో అక్కడ పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో పేకాట ముక్కలు, 3 కార్లు, 8 సెల్ ఫోన్స్, రూ.11,580 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులతో దీన స్థితిలో కుమారుడితో బాధితురాలు

ధూళిమిట్ట,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తుజాలపురం రమ ఇంట్లో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సామగ్రి దగ్ధమైంది. గతంలో భర్త చనిపోగా చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్న రమ కుటుంబం ఈ ఘటనతో రోడ్డున పడింది. ఇంట్లో ఎవరు లేకపోవడం, స్థానికులు వెంటనే మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో వర్షం ప్రారంభం కావడంతో కరెంట్ పోయింది. ఇంట్లో చీకటిగా ఉండటంతో క్యాండిల్ వెలిగించి రమ తన కొడుకుకు అన్నం తినిపించేందుకు బయటికి వెళ్లింది. క్యాండిల్ బట్టలకు అట్టుకోవడంతో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్, టీవీ, బియ్యం, నిత్యావసర వస్తువులు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం, దాతలు స్పందించి రమ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు

చేర్యాల శివారులోని దర్గాలో చోరీ

చేర్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారు అమీనొద్దీన్‌షా దర్గాలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు హుండీ ధ్వంసంచేసి నగదు చోరీకి పాల్పడ్డారు. రోజువారీలాగే అర్షద్ ముబీన్ దర్గా శుభ్రపరచడానికి వెళ్లిచూసేసరికి చాదర్‌లు చిందరవందరగా పడి ఉండటంతో పాటు ఆగంతకులు హుండీ ఎత్తుకెళ్లిపోయినట్టు గమనించాడు. హుండీలో సుమారు రూ.15వేలు నగదు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై పోస్టులు .. ఇద్దరిపై కేసు

రామాయంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావులపై అసభ్య పదజాలంతో సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఇద్దరిపై రామాయంపేట, నిజాంపేటల్లో కేసులు నమోదయ్యాయి. నార్సింగ్ మండలం జాప్తిశివనూర్, నిజాంపేట మండలం కల్వకుంట గ్రామానికి చెందిన ఇద్దరు వేర్వేరుగా రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను బెదిరిస్తూ పోస్టులు పెట్టారు. దీంతో వారికి పోలీసులు నోటీసులు జారీ చేసి, కేసులు పెట్టినట్లు ఎస్సైలు బాలరాజ్, రాజేశ్‌లు శనివారం రాత్రి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

శివ్వంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన చాకరిమెట్ల సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. మేడ్చల్ జిల్లా చింతల్ గ్రామానికి చెందిన గొల్ల లోకేష్(48) హైదరాబాద్ బాల్‌నగర్‌లోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శివ్వంపేట మండల పరిధిలోని చాకరిమెట్ల సమీపంలోని లక్ష్మాపూర్ గేటు వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న గొల్ల లోకేష్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ మధూకర్ రెడ్డి తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో ఫిట్స్ వచ్చి యువకుడి మృతి



సంజీవ్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లిన యువకుడు స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన చేగుంట పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేగుంట పట్టణానికి చెందిన తిరుపతి నర్సింలు, మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. కాగా చిన్న కుమారుడు సంజీవ్(20) భిక్కనూర్ మండలం దామరచెరువు గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి పెద్దమ్మ పండగ కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 17న వెళ్లారు. శనివారం సంజీవ్ మేనమామలతో కలిసి కామారెడ్డి జిల్లా పెద్ద మల్లారెడ్డి గ్రామంలోని సిమ్మింగ్‌పూల్‌లోకి ఈతకు వెళ్లారు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతుండగా సంజీవ్ అలియాస్ (లాలు)కు ఫిట్స్ రావడంతో మృతి చెందాడు.

అపస్మారక స్థితిలో కార్మికుడు..

ఐడీఏబొల్లారం ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో పని చేస్తున్న ఓ కార్మికుడు అపస్మారక పరిస్థితిలోకి వెళ్లి మృతి చెందిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లాకు చెందిన నాగేంద్రకుమార్ (28) ఐడీఏబొల్లారంలో నివాసం ఉంటూ ఐలాండ్ వీల్‌టెక్ పరిశ్రమలో కార్మికుడుగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా శనివారం తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో కళ్లు తిరుగుతున్నాయంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. సమీప బంధువు అరవింద్ యాదవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు..



సంజీవ్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన చేగుంట మండల పరిధిలోని బి కొండాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొంది భాను(18) మిత్రుడు తుమ్మల కనకరాజుతో కలిసి ఈ నెల 17న ద్విచక్ర వాహనంపై రాస్పల్లి నుంచి స్వగ్రామం కొండాపూర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో చేగుంట మండలం పొలంపల్లి శివారులో తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా వాహనానికి అడ్డువచ్చిన అడవి పందిని ఢీకొనడంతో భాను తలకు తీవ్రగాయాలయ్యాయి. గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదరి బొంది భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ..



అమృత(ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం రామాయంపేట మున్సిపల్ పరిధి గొల్పర్తిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమృత (40) శనివారం ఉదయం పాండ చెరువు వద్దకు బట్టలు తీసుకొని వెళ్లింది. దుస్తులు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారగా అక్కడే ఉన్న ఎక్స్‌కవేటర్ గుంతలో జారి పడి నీట మునిగి చనిపోయింది. భర్త సిద్ది రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

భార్యతో గొడవ పడి భర్త బలవన్మరణం

నర్సాపూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం రామచంద్రాపురం గ్రామంలో సారసురేష్(37) అనే వ్యక్తి భార్యతో గొడవ పడి ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ లింగ తెలిపిన వివరాల ప్రకారం సారసురేష్ సెంట్రింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య మానసతో గత రెండేళ్లుగా గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నర్సాపూర్‌లో సంతకు వెళ్లి కూరగాయలు తెచ్చేందుకు డబ్బులు ఇవ్వాలని భర్త సురేష్‌ను అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య తన వద్ద ఉన్న డబ్బులతో సంతకు వెళ్లి రాత్రి 9 గంటల ప్రాంతంలో నర్సాపూర్ నుంచి గ్రామానికి చేరుకోగా ఇంటి తలుపు గడియ పెట్టి ఉండటాన్ని గమనించింది. ఎంత పిలిచినా పలకకపోవడంతో సమీపంలోని వారిని పిలిచి ఇంటి తలుపులు పగులగొట్టి తీసి చూడగా ఇంట్లో చీరతో ఉరేసుకుని వేలాడుతున్న భర్త మృతదేహం కనిపించింది. శనివారం భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్య



ప్రిస్కిల్లా (ఫైల్)

రాయపోల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువతిని తల్లిదండ్రులు మందలించగా పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని మంతూరు గ్రామంలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మంతూరు గ్రామానికి చెందిన ప్రిస్కిల్లా (25) మూడేళ్ల నుంచి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నది. వైద్యులకు చూయించగా మందులు రాసి ఇచ్చారు. కానీ ఆమె డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడకపోవడంతో మందులు వేసుకోవాలని తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో ఆమె ఈ నెల 17న పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే నిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు గాయాలు



గాయపడిన మహిళ

బెజ్జంకి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఇద్దరు మహిళా కూలీలకు గాయాలైన సంఘటన మండలంలోని వడ్లూరు బేగంపేట గ్రామంలో శనివారం జరిగింది. వడ్లూరు బేగంపేట గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పథకంలో భాగంగా ల్యాండ్ లెవెల్ పనులు చేసేందుకు చెట్లు తీస్తున్న క్రమంలో చెట్టు కొమ్మ విరిగి గ్రామానికి చెందిన బుర్ర పద్మకు కాలు విరగగా, కొర్వే శ్యామలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు.


సాదుల విఠల్ ఇంట్లో భోజనం చేస్తున్న నీలం మధు ముదిరాజ్

గరిబోళ్ల ఆత్మగౌరవం పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):పేదింటి బిడ్డలు పస్తులుండకుండా, వారి కడుపు నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆత్మగౌరవాన్ని పెంచిందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం ముత్తంగిలో దళితుడు సాదుల విఠల్ ఇంట్లో రేషన్ బియ్యంతో తయారు చేసిన అన్నాన్ని వారి కుటుంబసభ్యులతో కలిసి తిన్నారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబసభ్యులతోపాటు ఇరుగు ప్రజలు సానుకూలంగా స్పందించి, ప్రజాపాలన పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆప్యాయంగా భోజనం పెట్టిన విఠల్ కుటుంబాన్ని శాలువాతో నీలంమధు సత్కరించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి. ప్రభాకర్ రెడ్డి, ముత్తంగి మాజీ ఎంపీటీసీ గడ్డ యాదయ్య, నాయకులు తూర్పు శ్రీను, అశోక్, సన్నీ యాదవ్, శంకర్, దశరథ్, వెంకటేష్, శ్రీను, ప్రవీణ్, కాళిదాస్, రాజు, బాలరాజు, శ్రీకాంత్, యాదయ్య, శ్రీ రామ్, సోమేష్, సత్యానారాయణ, దత్తు, నందు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

హిందువులే లక్ష్యంగా బెంగాల్‌లో హింస

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హిందువులే లక్ష్యంగా బెంగాల్‌లో హింస జరుగుతున్నదని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ)ధర్మప్రసార రాష్ట్ర సహప్రముఖ్ సుభాష్ చందర్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్ట నిరసన సాకుతో హిందువులపై జిహాదీ హింస పెద్ద ఎత్తున జరుగుతోందని అన్నారు. సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలో కాశ్మీర్ తరహాలో వేలాదిమంది బాధితులైన హిందువులు బలవంతపు వలసలు కూడా కనిపిస్తున్నాయని ఆరోపించారు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలనను విధించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్, కార్యదర్శి ప్రకాశ్, సహకార్యదర్శి శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, రవి, బజరంగ్ దల్ నాయకులు ప్రభగౌడ్, మనోజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు పాటించాలి

హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి

మిరుదొడ్డి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం అందెగ్రామంలో శంబుని దేవాలయం వద్ద బాణలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానససేవే మాధవసేవ అన్నారు. ఈర్ష, అసూయలను విడాలని, అందరూ కలిసిమెలిసి జీవించాలని కోరారు. బాణలింగార్చన కార్యక్రమంలో సుమారు 350 కుటుంబాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్‌జీ, గ్రామస్థులు శివలింగం, యాదగిరి, సుమన్, పోశయ్య, ప్రవీణ్, కుమారస్వామి, కనకరాజు తదితరులున్నారు.



మాట్లాడుతున్న విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి

'జేఈఈ'లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


మధుకుమార్


సాయిరాం


అనిల్

కౌడిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి ర్యాంకులు సాధించారు. కళాశాలలో చదువుతున్న పి.మధుకుమార్, పి.సాయిరాం, కె.అనిల్ ఉత్తమ పర్సంటేజీలు సాధించి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్ తెలిపారు. 2024-25 విద్యసంవత్సరంలో మొత్తం ఐదుగురు విద్యార్థులకు ఐఐటీ జేఈఈ కోచింగ్ అందించగా అందులో ముగ్గురు అడ్వాన్సుకు అర్హత సాధించారన్నారు. ఇందులో మధుకుమార్ 68.63, పి.సాయిరాం 57.43, కె.అనిల్ 49.40 శాతం సాధించారన్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్సు కోచింగ్ కోసం ఖమ్మంలోని గిరిజన గురుకుల ఐఐటీ కళాశాలకు పంపనున్నట్లు చెప్పారు. జేఈఈలో ఉత్తమ ప్రతిభచాటిన విద్యార్థులకు కళాశాల తరుపున ప్రత్యేకంగా అభినందించారు.

నేను ప్రధాని కావాలని కోరుకుంటున్నారు

ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్



పటాన్‌చెరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తనను ప్రధానమంత్రి కావాలని ప్రపంచంలోని అనేక దేశాల అధ్యక్షులు కోరుకుంటున్నారని ప్రజాశాంతి పార్టీ అధినేత డాక్టర్ ఏకే.పాల్ పేర్కొన్నారు. పాస్టర్ ప్రవీణ్‌ది ముమ్మాటికి దారుణమైన హత్య అని, రోడ్డు ప్రమాదం కానే కాదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం పటాన్‌చెరు మైత్రీ గ్రౌండ్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రవీణ్‌ను తాగుబోతుగా చిత్రీకరించే కుట్రలు జరిగాయన్నారు. అదే నిజమైతే అందుకు కారకులు సర్వనాశనమైపోతారన్నారు. విదేశాల నుంచి లక్షల కోట్లు తెచ్చే సత్తా ఉన్నా తనను ఎవరూ ఉపయోగించుకోవడం లేదన్నారు. ఇతర మతాల దేవుళ్లను తిట్టమని ఎక్కడా క్రైస్తవం బోధించదన్నారు. గతంలో రాముడిని దూషిస్తే తాను స్వయంగా ఖండించానన్నారు. ఒక పద్ధతి ప్రకారం క్రైస్తవంపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేక దేశాల అధ్యక్షులు తనను ఈ దేశానికి ప్రధాన మంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. జీసస్ కరుణిస్తే కోరిక నెరవేరుతుందన్న ప్రగాఢ విశ్వాసం ఉందన్నారు. క్రైస్తవులతో, తనతో పెట్టుకున్న వారు మాడి మసై పోతారని వ్యాఖ్యానించారు.

ప్రయోగాలతో పాఠాలు

జిల్లాలో సైన్స్ ల్యాబ్, మాథ్స్ ల్యాబ్‌ల ఏర్పాటు
కృత్యాధార బోధన, సులభంగా అభ్యసనం
రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తున్న విద్యార్థులు

రాయపోల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పుస్తకాల మధ్య నిశ్శబ్దంగా కూర్చుని చదివే పద్ధతిలో అంత ప్రయోజనం ఉండదని అంటున్నారు. ఆధునిక యుగంలో విద్యార్థుల్లో జిజ్ఞాస, అన్వేషణ, ఆసక్తి పెంచాలంటే పాఠ్యాంశాలను ప్రయోగాలతో బోధించడమే సరైన మార్గంగా భావిస్తున్నారు. అయితే, ఇవన్నీ ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాత్రమే సాధ్యమవుతాయి. కానీ, ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని కొత్త ప్రయోగాలను చేశారు. అందుకు అనుగుణంగా తాను పనిచేస్తున్న పాఠశాలను తీర్చిదిద్దుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలలో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.


బేగంపేట పాఠశాలలోని మ్యాథ్స్ ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు


ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో సర్టిఫికెట్ అందుకుంటున్న భాస్కర్‌రెడ్డి(ఫైల్)

సైన్స్ మ్యాథ్స్ ల్యాబ్

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, ల్యాబ్ కెమికల్స్ తదితర పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ల్యాబ్ గోడలపై శాస్త్రవేత్తల చిత్రాలతో ప్రేరణ కలిగించే విధంగా సైన్స్ మ్యాథ్స్ ల్యాబ్‌లను తీర్చిదిద్దారు.

వినూత్న కార్యక్రమాలు

బేగంపేట పాఠశాలలో రెండేళ్లుగా ఐడియా బాక్స్, డౌట్ బాక్స్, లిటిల్ టీచర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతూ జాతీయ సైన్స్, గణిత దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్ సీవీ రామన్ విగ్రహాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను చూసి అభినందించారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం. నేను 2023 అక్టోబర్ నెలలో బేగంపేట పాఠశాలలో చేరినప్పటి నుంచి, శాస్త్ర విద్యను నూతన దిశగా తీసుకెళ్లే కృషి ప్రారంభించాం. ఇక్కడి సైన్స్ ల్యాబ్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రతి పాఠ్యాంశాన్ని ప్రయోగాత్మకంగా బోధించేలా చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.



- భాస్కర్‌రెడ్డి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు


వరల్డ్ రికార్డు మెమో, సర్టిఫికెట్ అందుకుంటున్న పంజాల కార్తీక (ఫైల్)

జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తున్న విద్యార్థులు..

ఇటీవల మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్పూర్ మాక్రో విజన్ అకాడమీలో రామన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ సైంటిస్ట్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఐదవ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థి హర్షవర్ధన్, ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డిలు పాల్గొని ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్‌కు మూడో బహుమతి పొందారు.

కలామ్స్ వరల్డ్ రికార్డ్..

ఇటీవల పంజాల కార్తీక అనే విద్యార్థిని కష్టతరమైన ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను 8.85 సెకండ్లలో చెప్పి చెన్నైలో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో కలామ్స్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. అలాగే అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిజ్ఞాస జాతీయ స్థాయి కాంపిటేషన్‌లో బి. పావని, బి. వైష్ణవి అనే విద్యార్థినులు ఏపీటీఎస్ రీజినల్ స్థాయిలో ప్రథమ బహుమతిని అందుకొని, ఫిబ్రవరి అభినందనలు పొందారు. జాతీయ స్థాయి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో విద్యార్థులు ఎం. హర్షవర్ధన్, పి. కార్తీక, చైతన్య రూపొందించిన మల్టీపర్పస్ వాకింగ్ స్టిక్ ప్రాజెక్టు విజయవంతంగా నాలుగు దశలను పూర్తి చేసుకొని బూట్ క్యాంపు, ప్రాజెక్టు డెవలప్మెంట్ దశలకు ఎంపికై జూలై 29, 2025న ఢిల్లీలో నిర్వహించే ప్రదర్శనలో పాల్గొనబోతున్నారు.

ఉపాధి సరే.. వేతనం ఏది?

- మూడు నెలలుగా అందని జీతం
- ఇబ్బందుల్లో కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు


కానుకుంటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గుమ్మడిదల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. కూలీలకు సైతం చెల్లించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పనులు చేసినా కూలి డబ్బులు ఎప్పటికప్పుడు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ కష్టమవుతున్నదని కూలీలు వాపోతున్నారు. మూడు నెలలుగా జీతం లేక అప్పులు చేసి బతకాల్సి వస్తుందని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆరు నెలల క్రితం చుట్టుపక్కల గ్రామాలను కలుపుతూ గుమ్మడిదలని మున్సిపాలిటీగా ప్రకటించారు. దీంతో మండలంలోని మిగిలిన గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కొనసాగుతుంది. ఈ గ్రామాల పరిధిలో 500 మంది కూలీలు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు ఐదుగురు మెట్లు కొనసాగుతున్నారు. గుమ్మడిదల మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు, కూలీలకు మూడు నెలలుగా చెల్లించాల్సిన వేతనాల వివరాలను ఎంపీడీవో స్వప్నకు అందజేసి త్వరగా ఇవ్వాలని విన్నవించారు.

సకాలంలో అందించాలి



వేతనాలు అందక మూడు నెలలు అవుతుంది. దీంతో మేము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నాం. పనిభారం కూడా పెరిగింది. అయినా అన్నిటికీ ఓర్చుకుని పని చేస్తున్నాం. కానీ వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. స్పందించి వేతనాలు సకాలంలో అందించేలా చూడాలి.

- స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్, కానుకుంట

రైతులకు మేలు జరిగేలా



ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు చేయించాలి. దీంతో కూలీలతో పాటు రైతులకు మేలు జరుగుతుంది. మట్టి రోడ్డు నిర్మాణం వంటి పనులు చేయించాలి. అడవుల్లో పనులు చేయడం ప్రయోజనం ఉండదు. అక్కడ పని చేయడం కష్టంగా ఉంది. వెంటనే కూలీలకు పెండింగ్ లేకుండా వేతనాలు చెల్లించాలి.

- నర్సింహులు, కూలీ, కానుకుంట

నిధుల విడుదలలో జాప్యం



మూడు నెలల నుంచి ఉపాధి హామీ కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం అందకపోవడం వాస్తవమే. ఉపాధి హామీకి సంబంధించిన ఎస్ఆర్ఈజీఎస్ నిధులు విడుదల జాప్యంతో వేతనాలు అందడం లేదు. జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లా.

- ఉమాదేవి, గుమ్మడిదల ఎంపీడీవో



ఎంబీబీఎస్ సెకండియర్ ఫలితాలు విడుదల

సంగారెడ్డి మెడికల్ కళాశాలకు 99.24 ఉత్తీర్ణత శాతం

80 మంది ప్రథమ శ్రేణి, ఐదుగురికి డిస్టింక్షన్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సెకండియర్ ఫలితాలను కేఎన్‌ఆర్ యూనివర్సిటీ శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 99.24 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇందులో 80 మంది వైద్య విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించగా, ఐదుగురు డిస్టింక్షన్‌లో రాణించారు. ఈ పరీక్షలు గత జనవరి నెలలో జరిగాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.సుధామాధురి అభినందించారు.

గొంతెండిపోతోంది..

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



అల్లాదుర్గం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి.. మిషన్ భగీరథ నీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతుండటంతో తాగునీటి కోసం జనం ఆందోళన బాట పడుతున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కుతున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో 3,4,5 వార్డులకు మిషన్ భగీరథ ద్వారా అంతంత మాత్రంగానే నీరు సరఫరా అవుతోంది. 5వ వార్డులో బోరు ఏర్పాటు చేసినా, నీరు అడుగంటి ఒక్క చుక్క కూడా రావడం లేదు. దీంతో ఆయా కాలనీలో తాగునీ సమస్య తలెత్తింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాములు స్పందించినా సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. దీంతో శుక్రవారం ఆయా కాలనీల వారు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కాలనీల్లో తాగునీటి ఎద్దడి విషయాన్ని సన్నబియ్యం పంపిణీని పరిశీలించేందుకు వచ్చిన అదనపు కలెక్టర్, ఆర్డీవోల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రెండు మూడు రోజులకు ఒకసారి..

పుల్‌కల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పుల్కల్‌లో తాగునీటి ఎద్దడి నెలకొంది. మండలంలోని పెద్దారెడ్డిపేట వద్ద గల మిషన్ భగీరథ పథకం నుంచి సరఫరా అయ్యే మంజీర జలాలు రెండు, మూడు రోజులకొకసారి వస్తుండటంతో అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో శనివారం మహిళలు ఖాళీ బిందెలను వీధి రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. తమకు సరిపోనూ తాగునీరు సరఫరా కావడంలేదంటూ పలు పర్యాయాలు పంచాయతీ కార్యదర్శికి పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పాత పుల్కల్ గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్, వాల్వ్‌లు దెబ్బతినడం వల్లనే వారం రోజులుగా మంజీర జలాలు సరఫరా కావడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు.


మెదక్ సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో జరిగిన రన్ ఫర్ జీసస్‌లో క్రైస్తవులు

రన్ ఫర్ జీసస్

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'ఏసు పునరుత్థానుడయ్యాడు.. రండి చూద్దాం.. పరుగెత్తి.. ఎలుగెత్తి చాటుదాం..' అంటూ క్రైస్తవ సోదరులు శనివారం మెదక్ పట్టణంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్‌కు భక్తులు భారీగా తరలివచ్చారు. మెదక్ సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంల జరిగిన ఈ కార్యక్రమం పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి డాక్టర్ శాంతయ్య, గుంట సంపత్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనాలి

అకాల వర్షాలకు ఆగమవుతున్న అన్నదాతలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు




పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్/సిద్దిపేట అర్బన్/ సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తడిచిన ప్రతి ధాన్యాపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు జిల్లా సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అకాల వర్షాలకు ధాన్యం తడిచి రైతులు ఆందోళనలో ఉన్నారని అధికారులకు చెప్పారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. మహిళలకు మహాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాల కింద తులం బంగారం ఇస్తానని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి టోకరా ఇచ్చిందని ఆరోపించారు. పెద్దమ్మ దీవెనతోనే ఏప్రిల్ నెలలోనే రాఘవాపూర్ గ్రామ చెరువు మత్తడి దుంకుతుంది అంటే కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితమేనని ఈ సందర్భంగా హరీశ్‌రావు పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు బీఆర్‌ఎస్ మద్దతు

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని మే 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు బీఆర్‌ఎస్ పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలో జరిగిన కార్మిక సంఘాల సదస్సుకు ఆయన హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల చట్టాల రద్దుకు ఢిల్లీ వరకు వెళ్లి పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మొదటి నుంచీ బీజేపీ కార్మిక వ్యతిరేక పార్టీ అని, బడాబాబులు, బడా బడా పారిశ్రామిక వేత్తల పార్టీగా మారిపోయిందని అన్నారు. బడా బాబులకు 16 లక్షల 50 వేల కోట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాఫీ చేసిందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వమంటే చేతకాని కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. దేశంలో బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమే అని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు పెంచామని ఈ సందర్భంగా హరీశ్‌రావు తెలిపారు.

నేటి భద్రత రేపటి భవిష్యత్

అమ్మనాన్నల మాట విన్నట్లయితే తల ఎత్తుకుని జీవిస్తారని, తల్లిదండ్రుల మాట వినకపోతే తలదించుకుని బతకాల్సిన పరిస్థితి వస్తుందని హరీరావు అన్నారు. సిద్దిపేట మెట్రో గార్డెన్‌లో సిద్దిపేట ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భద్రంగా ఉండాలి, భవిష్యత్‌లో ఎదగాలి' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యారు. విద్యార్థుల హాబీలు ఏంటీ, వేసవి సెలవుల్లో ఏం చేస్తారు అనే అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మోటివేషనల్ స్పీకర్ రంజిత్ మాట్లాడారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

- నారాయణరావుపేట మండల ప్రజలకు తప్పని వ్యయప్రయాసలు
- చిన్నసవరణ కోసమైనా సుమారు 14 కిలోమీటర్ల ప్రయాణం
- నెట్‌వర్క్ ఇబ్బందులుంటే ఇక అంతే..
- మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అనే తేడా లేకుండా అన్నీ అవసరాలకు ఆధార్ కార్డు అవసరం ఎంత కీలకమైందో తెలిసిందే. అలాంటి ఆధార్ కార్డుల్లో అవసరమైన చిన్న తప్పుల సవరణ, ఇతర మార్పులు, చేర్పులతో పాటు నూతన కార్డు కావాలన్నా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆధార్ కేంద్రానికి వెళ్తారు. అయితే మండలకేంద్రమైన నారాయణరావుపేటలో ఆధార్ కేంద్రం అందుబాటులో లేక మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నారాయణరావుపేట మండలంలోని జనాభా ప్రాతిపదికన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిఉండగా, అలా ఏర్పాటు చేయకపోవడంతో మండలంలోని ప్రజలు ఇతర మండలాలకు వెళ్లాల్సివస్తున్నది. దూరాభారమైనప్పటికీ ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఆయా ఆధార్ కేంద్రాలకు వెళ్లినా, ఒక్కోసారి నెట్‌వర్క్ లేదా ఇతర సమస్యలతో సమయానికి పనులు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిద్దిపేట, దుబ్బాక మండలాలే దిక్కు

నారాయణరావుపేట మండలంలో 11 గ్రామ పంచాయితీలు 4 మదిర గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఆధార్‌లో చిన్న చిన్న సవరణల కోసం 17 కిలో మీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేట జిల్లా కేంద్రం లేదా 14 కిలో మీటర్ల దూరంలో ఉన్నా దుబ్బాక మండలకేంద్రంలో ఉన్న అధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇతర అత్యసర పనులన్నింటినీ పక్కన పెట్టి వెళ్లినా వ్యయప్రయాసలతో పాటు సమయం వృథా అవుతున్నదని ప్రజలు వాపోతున్నారు. ఆధార్ నమోదు లేదా సవరణకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల్లో ఏ ఒక్కటి ఇంటివద్ద మరిచిపోయినా తిరిగి గ్రామానికి వెళ్లివచ్చేసరికి దినమంతా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆధార్ కార్డులో తప్పులుంటే కొందరు ప్రైవేటు వ్యక్తులు వాటి సవరణకు ఇష్టారాజ్యంగా డబ్బులు దోచుకుంటూ తాత్కాలికంగా మార్పులు చేస్తున్నారు. సవరణ అనంతరం తీరా అన్‌లైన్‌లో అలాగే ఉండడంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ఆధార్ సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో నారాయణరావుపేట మండలం కేంద్రంలోని మీ సేవా కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని అప్పటి మంత్రి హరీశ్‌రావును పలుమార్లు కోరినప్పటికి ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోయారు. ఇప్పటికైనా ప్రజల సౌకర్యం దృష్ట్యా మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని మంజూరు చేయాలని ఆయ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నారాయణరావుపేట మండలకేంద్రంలో మీ సేవా కేంద్రం ఉన్నా అందని ఆధార్ సేవలు

కేంద్రాల వద్ద పడిగాపులు తప్పడంలేదు



చిన్న పిల్లలను తీసుకుని నూతన ఆధార్ కార్డు కోసం సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. తీరా అక్కడికి వెళ్లాక నెట్‌వర్క్ సమస్య ఉన్నా, పని కాకపోయిన చిన్న పిల్లలలో ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు తప్పవు. కొన్ని సందర్భాల్లో 2 లేదా 3 రోజులు తిరిగితే తప్ప ఆధార్ కార్డు నమోదు పూర్తికావడం లేదు. మండలకేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని మంజూరు చేయాలి.

\- గుర్రం లింగారెడ్డి, రైతుసంఘం నాయకుడు

చిన్న సవరణ ఉన్నా ఇక్కట్లే



ఆధార్ కార్డులో చిన్న సవరణ ఉన్నా కిలోమీటర్ల దూరం ప్రయాణించక తప్పడంలేదు. తీరా అక్కడికి వెళ్లాక పని కాకపోతే మరిన్ని ఇబ్బందులు. మండల పరిధిలో 11 గ్రామ పంచాయతీలు ఉన్నా ఆధార్‌కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రజల కష్టాలు తీరడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆధార్‌కేంద్రాన్ని మంజూరు చేస్తే ఇబ్బందులు కొంతవరకైనా తప్పుతాయి.

\- నిమ్మశెట్టి మహేష్, నారాయణరావుపేట

అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని దుబ్బాక అగ్నిమాపక అధికారి కమలాకర్ అన్నారు.శనివారం దుబ్బాక సినిమా థియేటర్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు.

గజ్వేల్ ప్రెస్‌క్లబ్ రజతోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

\- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు

గజ్వేల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేసి 25ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న రజతోత్సవాలను ఘనంగా జరుపుకుందామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గజ్వేల్ ప్రెస్ క్లబ్ రజతోత్సవ సభను పట్టణంలో జూన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకుముందు ములుగు, జగదేవ్‌పూర్, వర్గల్ మండలాల్లో రజతోత్సవ సన్నాహక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఎల్లారెడ్డి, జమీల్, సురేందర్, మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, కిరణ్, దాసరి కృష్ణ, నాయిని యాదగిరి, కృపాకర్‌రెడ్డి, ఎల్లయ్య, తాడెం నర్సింలు, బాల్‌నర్సయ్య, నర్సింలు, మునీర్, బాల్‌చంద్రం, లక్ష్మినారాయణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

గౌడ మహిళలను ఆలయం నుంచి పంపించడం అమానుషం

హుస్నాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గౌడ సామాజిక వర్గానికి చెందిన కొంత మంది మహిళలను ఆలయం నుంచి బయటకు పంపించడం అమానుషమని గౌడ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ మార్క అనిల్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి సంఘటనలు జరుగడం దురదృష్టకరమన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు శ్రీకాంత్, పూదరి వరప్రసాద్, తదితరులున్నారు.

లద్నూరులో ఘనంగా బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం

మద్దూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు రాజేష్, వంశీకృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, స్థాపితా దేవతాపూజతో పాటు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం పోచమ్మతల్లికి డప్పుచప్పుళ్ల శివసత్తుల పూనకాల మధ్య గ్రామస్తులు బోనాల సమర్పణతో పాటు సాయంత్రం బొడ్రాయికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

25 హెచ్‌పీ విద్యుత్‌తో విశ్వకర్మలకు లబ్ధి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న విశ్వకర్మలకు 25 హెచ్‌పీ కెపాసిటీ సరఫరాకు అనుమతి ఇవ్వడంతో పాటు యూనిట్ రేట్ నాలుగు రూపాయలను అలాగే కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం గొప్ప విషయమని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాసంపల్లి నరసింహ చారి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో విశ్వకర్మ సంఘం నాయకులతో కలిసి వారు మాట్లాడారు. అలాగే యూనిట్ ధరను నాలుగు రూపాయలుగా కొనసాగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం


చిన్నకోడూరు: గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో శారద

సిద్దిపేట అర్బన్/కొండపాక/చిన్నకోడూరు/దౌల్తాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన వెంటనే నవజాత శిశువులకు తల్లి పాలు పట్టించడం వలన బిడ్డకు ఆరోగ్యం కలుగుతుందని ఆరు నెలల పాటు తల్లిపాలు పిల్లలకు తప్పకుండా అందించాలని ఐసీడీఎస్ అర్బన్ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై ఆమె మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు కొండపాక లోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో శనివారం పోషణ్ పక్వాడా, పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పిల్లలకు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కొండపాక ఆయుర్వేదిక్ వైద్యురాలు డాక్టర్ రజినీ కంచెర్ల గర్భిణులు సుఖప్రసవానికి చేయాల్సిన యోగాసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మధు మనిషా యోగాసనాలు వేసి చూపించారు. చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పండ్లు, కూరగాయాలు, వ్యాయామం వల్ల సమకూరే ప్రయోజనాలను గూర్చి సీడీపీవో శారద, ఎంపీడీవో జనార్ధన్ అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేసి, చిన్నారులకు అన్నప్రసాన, అక్షరాభ్యాసం చేయించారు. దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని సూరంపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్టు అఫీసర్ ఎల్లయ్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

మంత్రి పదవికి మైనార్టీ నాయకుడే దొరకలేదా?

● మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా మంత్రి పదవి ఇవ్వడానికి ఒక మైనార్టీ నాయకుడు దొరకటం లేదా అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రశ్నించారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం యాత్రికులకు మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో మైనారిటీలకు కష్టం వస్తే ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావటం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో విదేశీ నిధులు ఇక్కడికి వస్తే కాంగ్రెస్ హయాంలో ఇక్కడి నుంచి విదేశాలకు వెళుతున్నాయని ఏద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ మాట్లాడుతూ హజ్ యాత్రికులు దేశం, రాష్ట్రం కోసం శాంతి కోసం ప్రార్థనలు చేయాలన్నారు.

● సిద్దిపేట పట్టణంలోని మోహినీపుర శ్రీ వేంకటేశ్వర దేవస్థానం స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులతో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఐదు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి గాను దాతలను భాగస్వామ్యం చేయాలన్నారు. స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల ఘనంగా వేడుకగా నిర్వహించాలన్నారు. తనవంతుగా లక్ష రూపాయలు ప్రకటించినట్టు తెలిపారు.

● అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా కాచం కాశీనాథ్, ప్రధాన కార్యదర్శిగా గంజి రాములు, కోశాధికారిగా గోపిశెట్టి శరభయ్య, పీఆర్‌వోగా డా. మాంకాల నవీన్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం శనివారం మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి మాజీమంత్రి అభినందనలు తెలియజేశారు.


హజ్ యాత్రికులను సన్మానిస్తున్న హరీశ్‌రావు, ఫారూఖ్ హుస్సేన్


కల్లెపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

చివరి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

బెజ్జంకి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని దాచారం, గుగ్గిళ్ళ, కల్లెపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, ఏపీఎం నరసయ్య, ఐకేపీ సీసీలు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

వరి ధాన్యం శుద్ధి యంత్రాలు మంజూరు

కోహెడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలానికి రూ. రూ 15 లక్షల విలువ చేసే 3 వరి ధాన్యం శుద్ధి చేసే యంత్రాల మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజ్ తెలిపారు. శనివారం మండలంలోని వరికోలు, బస్వాపూర్, శనిగరం ఐకేపీ ధాన్యం కేంద్రాలకు పంపిణీ చేసినట్టు ఆమె వివరించారు.

హెచ్‌'హై'వీ

(7వ పేజీ తరువాయి)

కేసులు నమోదవుతున్నాయి. గత 10 ఏళ్లుగా తల్లిదండ్రుల నుంచి ఎయిడ్స్ సోకకుండా చిన్నారుల జననాలు నమోదవుతున్నట్లు ఐసీటీసీ అధికారులు, సిబ్బంది వెల్లడిస్తున్నారు. హెచ్ఐవీ బారిన పడినవారికి జిల్లా కేంద్రమైన జీజీహెచ్ ఆసుపత్రిలోని ఎఆర్‌టీ సెంటర్ విభాగంలో మందులను అందజేస్తున్నారు. మందులను వాడుతూ ఆల్కహాల్, సిగరెట్ లాంటి ఎలాంటి చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా ఉంటే ఎక్కువకాలం జీవించే అవకాశాలున్నాయి.

అందరికీ అందని పింఛన్

ఎయిడ్స్ బారిన పడిన వారికి ఆర్థికంగా కొంత భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.2,016 పింఛన్‌ను ప్రకటించింది. అప్పట్లో నమోదు చేసుకున్న 1,029 మంది బాధితులకు ఈ పింఛన్ అందుతున్నది. అయితే, జిల్లాలో క్రమంగా ఈ ఎయిడ్స్ రోగుల సంఖ్య 3,988కి పెరిగింది. దీంతో ఈ వ్యాధిగ్రస్థులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు మోక్షం లభించలేదు. 15 నెలల నుంచి ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు

ధూళిమిట్ట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామ మోయ తుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా వాగుల్లో నుంచి ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆన్‌లైన్ గేమ్స్‌తో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

చిన్నకోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. మండలంలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో శనివారం జిల్లాలోని సివిల్, అర్మడ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రదర్శించిన అర్మ్స్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు కార్తిక్, పూర్ణ చందర్, ధరణి కుమార్, రాజేష్, విష్ణుప్రసాద్, కార్తీక్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని చౌడారం గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మూఢనమ్మకాలు, చేతబడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గూర్చి సిద్దిపేట పోలీస్ కళాబృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు.

కామన్‌స్కూల్ విధానాన్ని అమలు చేయాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కామన్‌స్కూల్ విధానాన్ని అమలు చేయాలని ఎపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. శనివారం దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు జానకిరాములు ఉద్యోగ విరమణ అభినందన సభలో ఏర్పాటు చేసిన విద్యాసదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. నూతన విద్యావిధానం లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. విద్యారంగంలో అస్పష్టత ఉందని, దానికి పరిష్కారంగా సర్కారు ఆధ్వర్యంలో ప్రీస్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్లు జమీర్, గంగాభవాని, తిరుపతి, ఎంఈవోలు ప్రభుదాస్, అంజయ్య, ప్రవీన్‌బాబు, తదితరులున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

● జిల్లా ఆయిల్‌ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చునని జిల్లా ఆయిల్‌ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి మల్లేశంతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ పంటలను సాగుచేసిన రైతులు పలుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీని, ఎస్సీఎస్టీలకు 100శాతం సబ్సిడీనిఅందిస్తుందని తెలిపారు.

తొగుటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

తొగుట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తొగుటలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రక్తదానశిబిరం నిర్వహించారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి తొగుట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో సిద్దిపేట బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరంలో 26 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రవిందర్, నర్సింహులు, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, భరత్, బ్లెడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ శ్రావణి, తొగుట మెడికల్ ఆఫీసర్ రాధాకిషన్, ఆస్పత్రి సిబ్బంది కనకచంద్రం, ఇమ్రాన్, ప్రణీత్, రమేశ్, బాలకిషన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసను, లైంగిక వేధింపులను అరికట్టి మహిళలకు భద్రత కల్పించాలని ఐద్వా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పేర్కొన్నారు. శనివారం మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర సిద్దిపేటకు చేరుకున్న సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మహిళా హక్కులకు స్వేచ్ఛకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అమరుల యాది పేరుతో యాత్ర కొనసాగుతుందని, ఇప్పటికైనా మహిళలు మేల్కొని మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యాత్రలో రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది ధర్నా

గజ్వేల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని అతిథి ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు గజ్వేల్ పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ... అతిథి ఆసుపత్రిలో ఏడాదిగా సరైన సమయంలో సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే మహిళలని చూడకుండా వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, డాక్టర్లు యుగంధర్, సంతోష్, హరిశంకర్, రాజు, జమీర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఫలితాల్లో హుస్నాబాద్ (జిల్లెలగడ్డ) ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. కళాశాలలోని 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఇందులో 26 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ బి రాజు తెలిపారు. కళాశాలలోని బి సునీల్ 81.98, టి రాజేష్ 81.94, జే హర్షవర్ధన్ 81.72, డి సిద్దార్థ 77.33, బి మోక్షజ్ఞ 77.04, జి విష్ణు 74.11, ఎల్ ప్రవీణ్ 74.1,జె విజయ్ 73.56, కె ప్రేమ్‌చరణ్ 71.96, ఆర్ సాయికుమార్ 70.73 పర్సంటేల్ సాధించారు. వారికి ప్రిన్సిపాల్ స్వీట్లు తినిపించి అభినందించారు.

సిద్దిపేట డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, రసాయనశాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీధర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే కృష్ణంరాజు పర్యవేక్షణలో సింథసిస్, క్యారక్టరైజేషన్, బయలాజికల్ ఎవల్యూషన్, అండ్ మాలిక్యులర్ డాకింగ్ స్టడీస్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగానూ శ్రీధర్‌కు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎం శ్రీధర్‌ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా చేయించుకోవాలి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజోతి): తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఏడాదికి రూ.2వేలు చెల్లిస్తే 40లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లో సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ నూతనంగా అందుబాటులోకి వచ్చిన రూ.40 లక్షల ప్రమాదబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ

హుస్నాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హుస్నాబాద్ పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పురవీధుల గుండా ప్లకార్డులు ప్రదర్శిస్తూ క్రైస్తవ గీతాలతో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రదర్ సాల్మన్ రాజ్, పాస్టర్ మలాకీ, రత్నకుమార్, ఇస్సాక్, తిమోతి, ఇజ్రాయేల్, దాస్‌బాబు, జాన్సన్, రాజు, వివేక్ తదితరులున్నారు.

క్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకం

గజ్వేల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గజ్వేల్‌లోని ఇందిరా పార్కు చౌరస్తా నుంచి ప్రజ్ఞాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రూబెన్, బాపురెడ్డి, ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నేత అంక్షారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి


రాయపోల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, కొండపాక మండలం దుద్దెడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు కార్యకర్తలు

రాయపోల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ వచ్చిన ప్రభుత్వం 16 నెలలు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కొండపాక/కుకునూరుపల్లి: బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు పెద్దఎత్తున కదలి రావాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కొండపాక మండలంలోని దుద్దెడలో, అదేవిధంగా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రజతోత్సవ సభ సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే గ్యారెంటీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రజతోత్సవ సభకు గులాబీ దండు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరుతూ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ ఎంపీపీలు కనకయ్య, రాధా కిషన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.